# రేసింగ్ చాంప్ సాయిదీప్



ఖైరతాబాద్, జనవరి 1: అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ మోటర్ సైక్లిస్ట్ (ఏఎఫ్ఎం) చాంపియన్ షిప్ పోటీల్లో భారతీయ రేసర్ ప్రతిభ చాటాడు. డిసెంబర్ 31 వరకు అమెరికాలో జరిగిన బటన్ విల్లో వే పార్క్, థండర్ వీల్ రేస్‌లలో తిరుపతికి చెందిన ఎం. సాయిదీప్ అగ్రస్థానంలో నిలిచాడు. కష్టతరమైన ఈ రేసులో విజేతగా నిలువడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నాడు. అమెరికాలో జరిగిన పోటీల్లో సత్తాచాటడం భారతీయుడిగా.. అందులోనూ తెలుగువాడిగా ఎంతో గర్వంగా ఉందని తెలిపాడు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే భారత రేసర్లకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సాయిదీప్ తెలిపాడు.




అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో తెలుగు యోధాస్ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. సోమవారం కటక్‌లో జరిగిన పోరులో యోధాస్ 34-27తో రాజస్థాన్‌పై గెలుపొందింది.

# జోరుగా సాధన

చెమటోడుస్తున్న టీమ్ ఇండియా

రేపటి నుంచి రెండో టెస్టు

**సఫారీ గడ్డపై టెస్టు సిరీస్ గెలువాలనే లక్ష్యంతో దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన టీమ్‌ఇండియా.. ఇప్పుడు కనీసం సమమైనా చేయాలని జోరుగా సాధన చేస్తున్నది. తొలి పోరులో తేలిపోయిన భారత బ్యాటర్లు.. నెట్స్‌లో గంటల కొద్ది ప్రాక్టీస్ చేస్తుండగా.. బౌలర్లు తమ అస్ర్తాలకు పనిపెడుతున్నారు. మరి రేపటి నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్టులోనైనా మనవాళ్లు మెరుగైన ప్రదర్శన చేస్తారా చూడాలి!**



కేప్‌టౌన్: మూడు దశాబ్దాలుగా ఊరిస్తున్న దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ విజయం.. ఈ సారి కూడా అందని ద్రాక్ష గానే మిగలగా.. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 'డ్రా' చేసేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో ఇన్నింగ్స్ పరాజయం ఎదుర్కొన్న రోహిత్ సేన.. తప్పులు సరిదిద్దుకొని సత్తాచాటేందుకు సిద్ధమైంది. సెంచూరియన్ పోరులో బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్.. బౌలింగ్‌లో బుమ్రా మాత్రమే రాణించగా.. మిగిలిన వాళ్లు ఆకట్టుకోలేకపోయారు. ముఖ్యంగా టెస్టుల్లో వన్‌డౌన్‌కు మారినప్పటి నుంచి శుభ్‌మన్ గిల్ ఆటతీరు దిగజారుతున్నది. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ కూడా రాణించాల్సిన అవసరం ఉంది. ఇక కెప్టెన్ రోహిత్ అటు సారథిగానూ ఇటు ఓపెనర్‌గానూ ప్రభావం చూపలేకపోయాడు. బౌన్స్‌కు సహకరిస్తున్న పిచ్‌పై సఫారీ పేసర్లను కాచుకోవడం కోసం సోమవారం టీమ్‌ఇండియా కఠోర సాధన చేసింది. కోహ్లీ, శ్రేయస్ గంటల కొద్ది బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా.. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ శిక్షణను పర్యవేక్షించాడు. లెఫ్టార్మ్ పేసర్లను ఎదుర్కొనేందుకు మనవాళ్లు కొత్త టెక్నిక్ ప్రయత్నిస్తూ కనిపించారు. బుమ్రా, సిరాజ్, అవేశ్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ సుదీర్ఘంగా బౌలింగ్ చేశారు. మరోవైపు షార్ట్‌పిచ్ బంతులను ఆడేందుకు ఇబ్బంది పడుతున్న శ్రేయస్ వాటిపై సాధన చేశాడు. ప్రాక్టీస్‌లో భాగంగా గాయపడ్డ పేస్ ఆల్‌రౌడర్ శార్దూల్ ఠాకూర్ కాసేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

# చివరిదైనా నెగ్గేనా!

ముంబై: స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయిన భారత మహిళల జట్టు ఇక చివరి మ్యాచ్‌లోనైనా నెగ్గి పోరాట పటిమ కనబర్చాలని చూస్తున్నది. తొలి మ్యాచ్‌లో కంగారూలకు పోటీనివ్వలేకపోయిన హర్మన్‌ప్రీత్ బృందం.. రెండో వన్డేలో విజయానికి చేరువగా వచ్చి విఫలమైంది. రిచ ఘోష్, జెమీమా రోడ్రిగ్స్ రాణించినా.. కీలక సమయంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో టీమ్‌ఇండియాకు పరాజయం తప్పలేదు. ఇప్పుడు ఆ లోపాలను సరిదిద్దుకొని సమిష్టిగా సత్తాచాటాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. మరోవైపు మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. స్టార్ ప్లేయర్లతో నిండి ఉన్న కంగారూలను అడ్డుకోవాలంటే.. మన అమ్మాయిలు శక్తికి మించి పోరాడాల్సిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధన, యస్తిక భాటియా, జెమీమా, రిచా, హర్మన్, దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్ సమిష్టిగా సత్తాచాటాల్సిన అవసరం ఉంది. ఇక టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాను వణికించిన మన బౌలర్లు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఆ స్థాయి ప్రభావం చూపలేకపోతున్నారు. ఫీల్డింగ్ కూడా మెరుగుపడాల్సి ఉంది.

నేడు భారత్, ఆస్ట్రేలియా మూడో వన్డే



## హ్యాండ్‌బాల్ టోర్నీ షురూ

**పాలమూరులో రాష్ట్ర స్థాయి పోటీలు**

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 1: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. పోటీలను ప్రారంభించిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పాల్గొంటున్నాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 14-4 గోల్స్ తేడాతో నల్లగొండపై, 15-8తో ఆదిలాబాద్‌పై గెలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 8-6తో మెదక్‌పై, 10-9తో హైదరాబాద్‌పై విజయం సాధించింది. టోర్నీ ఆరంభ కార్యక్రమంలో డీఈవో రవీందర్, కౌన్సిలర్ రష్మిత, ఏఎంవో బాలుయాదవ్, సీఎవో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



## వన్డేలకు వీడ్కోలు



వార్నర్

సిడ్నీ: ఆస్ట్రేలియా విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఈ వారం పాకిస్థాన్‌తో మూడో టెస్టు అనంతరం సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోనున్న వార్నర్.. వన్డేలకు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. సోమవారం సిడ్నీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తన కెరీర్‌లోని ఎత్తుపల్లాల గురించి వార్నర్ మాట్లాడాడు. 'కెరీర్‌లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఇక్కడి వరకు వచ్చా. చాలా అడ్డంకులు ఎదురయ్యాయి. వాటిని అధిగమించేందుకు తీవ్రంగా శ్రమించా. ఆస్ట్రేలియా క్రికెట్‌ను మరింత ఉన్నత స్థితికి చేర్చేందుకు నా వంతు కృషి చేశా. కెప్టెన్సీ బ్యాన్‌తో కాస్త ఇబ్బంది పడ్డా.. ఐపీఎల్ జట్లకు నాయకత్వం వహించడాన్ని గౌరవంగా భావిస్తున్నా'అని 37 ఏండ్ల వార్నర్ పేర్కొన్నాడు.

## టైటాన్స్ పరాజయం

హైదరాబాద్, ఆటప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు ఏది కలిసి రావడం లేదు. కొత్త సంవత్సరంలో ఆడిన తొలి మ్యాచ్‌లో సోమవారం తెలుగు టైటాన్స్ 18-54తో పుణెరీ పల్టన్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. పల్టన్ తరపున మోహిత్ గోయల్ 13 పాయింట్లతో చెలరేగాడు.

## ఓయూ సారథిగా ఇంతియాజ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉస్మానియా యూనివర్సిటీ పుట్‌బాల్ జట్టుకు సయ్యద్ ఇంతియాజ్ సారథిగా వ్యవహరించనున్నాడు. ఇటీవల జరిగిన సౌత్ జోన్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన ఓయూ జట్టు ఆల్‌ఇండియా టోర్నీకి ఎంపికైంది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.